క్లుప్తంగా

ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సీటీజీ సంఘ సభ్యులు

అమలాపురం టౌన్: పట్టణంలో మిద్దె తోటలను పండించే సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్(సీటీజీ) సంఘ సభ్యులు మంగళవారం స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘ భవనంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మిద్దె తోటల పెంపకంలో మెళకువలు, అధునాతన సాగు విధానాలపై చర్చించుకున్నారు. కాకినాడకు చెందిన బోటనీ అధ్యాపకుడు మునిప్రసాద్ రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులతో మిద్దెపై ఆకు కూరలు, కూరగాయలను ఎలా పెంచుకోవాలో వివరించారు. ఎవరి పంటను వారే పండించుకుని భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని సీటీజీ సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాయిబాబు, బి.శివరామకృష్ణ, షరీఫ్, దువ్వూరి కల్యాణి, రమణి మాధవి, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ కిచెన్ తనిఖీ



సెంట్రల్ కిచెన్‌ను తనిఖీ చేస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: నియోజకవర్గ పరిధిలో మిచాన్ తుపాను నేపథ్యంలో పునరావాస కేంద్రాలకు తరలించిన బాధితులకు ఆహారాన్ని వండి పంపిణీ చేస్తున్న సెంట్రల్ కిచెన్ అన్నపూర్ణాలయను ఆర్ఏఓ మునిస్వామి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆహారపదార్థాల మెనూను గురించి కిచెన్ ఇన్‌చార్జి పాము సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన బాధితులకు ఆహారాన్ని పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

9న లోక్ అదాలత్

అమలాపురం టౌన్: ఈనెల 9వ తేదీన అమలాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు సముదాయంలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంక్ కేసులు, మోటారు ప్రమాదాల కేసులతో పాటు రాజీ పడతగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. న్యాయవాదులు, పోలీస్, బ్యాంక్, రెవెన్యూ, మున్సిపల్, బీఎస్ఎన్ఎల్ అధికారులు లోక్ అదాలత్ నిర్వహణలో భాగస్వాములై ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పాఠశాలలకు సెలవు

యానాం: మిచాంగ్ తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈ నెల 6వ తేదీ బుధవారం యానాం నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి ఆదేశాల మేరకు సెలవు ప్రకటించినట్లు విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా అయ్యప్ప లక్షనామార్చన



అయ్యప్పస్వామికి లక్షనామార్చన పూజ చేస్తున్న స్వాములు

యానాం: గౌతమీ గోదావరి తీరాన కొలువైన దత్తమణికంఠ ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో లక్షనామార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుస్వాములు ఉమారెడ్డి జయరామ్, సంగాని బంగార్రాజులు పూజలో పాల్గొన్నారు. గిరియాంపేట, సావిత్రీనగర్ తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చిన స్వాములందరికీ వడిని మాజీమంత్రి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గురుస్వాములు ఆకుల నాగేశ్వరరావు, చెక్కా నూకరాజు, ఆకుల మార్కండేయులు, బర్రే మల్లేశ్వరరావు, వాసిరెడ్డి సుబ్బారావు, సబ్బతి లోకేశ్వరరావు పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్

అంబాజీపేట: భారీ వర్షాలకు కొబ్బరితోటలు నీట మునిగిపోవడంతో విష సర్పాలు ఇళ్లలోకి చేరుతున్నాయి. దీనిలో భాగంగానే అంబాజీపేట మండలం గంగలకురు అగ్రహారంలో తాచుపాము హల్ చల్ చేసింది. శింగంశెట్టి వెంకట నాగభూషణంకు చెందిన వంట గదిలోకి పాము రావడంతో అతని కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. దాంతో స్నేక్‌క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం ఇవ్వడంతో చాకచక్యంగా తాచుపామును పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించారు. అనంతరం జనసంచారం లేని ప్రాంతంలో పామును విడిచిపెట్టారు.



అన్నంపల్లిలో నీట మునిగిన కొబ్బరి తోటలు



ముంపునకు గురైన అమలాపురం సావరం రోడ్డు



మురమళ్లలో నీట మునిగిన కొత్తకాలనీ



ఉప్పూడిలో నీట మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న అధికారులు

స్తంభించిన జీన జీవనం

- ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- భారీ వర్షాలకు పలుచోట్ల మునిగిన వరి చేలు
- అండగా ఉంటామంటూ భరోసా కల్పించిన నేతలు



కొప్పిగుంటలో నేలకూలిన చెట్లను తొలగిస్తున్న రెస్క్యూ టీమ్



గాడిలంకలో బాధిత రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం/కాట్రేనికోన/ఉప్పలగుప్తం/అమలాపురం టౌన్/ఐ.పోలవరం/అల్లవరం/యానాం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో ఆది, సోమ, మంగళవారాల్లో వీచిన ఈదురుగాలుల కారణంగా పూరి గుడిసెలు, అనేకచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితం కావడంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. సముద్రం అల్లకల్లోలంగా మారి కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండడంతో తీర ప్రాంత ప్రజలు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు. పలుచోట్ల వరి చేలు నీట మునగడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరయ్యారు. రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పర్యటించి బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

గత రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలతో అమలాపురం పట్టణంలో జన జీవనం స్తంభించింది. మంగళవారం సెలవు కావడంతో పాటు ఎడతెరిపి లేని వర్షాలకు పట్టణంలో వ్యాపార దుకాణాలు తెరుచుకోలేదు. వర్షం కారణంగా సావరం రోడ్డు, గండు వీధి, కుంకాల సందు రోడ్డు, గరిగుంట చెరువు రోడ్డు ముంపు బారిన పడ్డాయి. స్థానిక నల్ల వంతెన దిగువున గల ఎస్ఈబీ(ఎక్సైజ్) కార్యాలయ భవనం జల దిగ్బంధంలో చిక్కుకుంది. పట్టణ ప్రవేశం ఈదరపల్లి వంతెన నుంచి ఆర్టీసీ బస్‌స్టేషన్, కలశం సెంటరు మీదుగా ఉన్న ప్రధాన రోడ్డు ముంపునకు గురైంది. అధిక వర్షాలతో పోటెత్తిన డ్రెయిన్లలో చెత్తా చెదారం అడ్డు వచ్చి ప్రవాహం స్తంభించిపోవడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కౌన్సిలర్లు బండారు గోవిందు, చిత్రపు రామకృష్ణ, రాజీ గోపి తదితరులు రంగంలోకి దిగి ముంపు నీరు త్వరగా లాగేలా చర్యలు చేపట్టారు. జేసీబీలు ఏర్పాటుచేసి డ్రెయిన్లలో అడ్డుగా ఉన్న చెత్తా చెదారాన్ని తొలగింపజేశారు.



బండారులంకలో మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..

- తుపాను బాధితులకు ధైర్యం చెప్పిన నేతలు, అధికారులు
- క్షేత్రస్థాయిలో పర్యటించిన మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ
- శరవేగంగా సహాయకచర్యలు

తాళ్లరేవు/అమలాపురం రూరల్: మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన ప్రతీఒక్కరినీ అన్నివిధాలా ఆదుకుంటామని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, టీటీడీ పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లు తెలిపారు. మంగళవారం వారు క్షేత్రస్థాయిలో పర్యటించి అండగా ఉంటామని బాధితులకు ధైర్యం చెప్పారు. రైతులకు నష్టం కలగకుండా ఉండాలనే లక్ష్యంతో తేమ శాతం ఎక్కువగా ఉన్నా, ధాన్యం రంగు మారినా కొనాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. అల్లవరం మండలం రెల్లుగడ్డలో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ ముఖ్యకార్యదర్శి జి.జయలక్ష్మి, కలెక్టర్ హిమాన్షు శుక్లాలు వరిచేలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.



తిళ్లకుప్పలో స్థానిక అధికారులతో మాట్లాడుతున్న జేసీ నుపూర్ విజయ్ తదితరులు

యుద్ధ ప్రాతిపదికన సహాయకచర్యలు

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడల ఆదేశాలతో నష్టం జరిగిన చోట యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. రెస్క్యూ టీమ్‌లు రంగంలోకి దిగి రోడ్లపై పడిన చెట్లు, విద్యుత్ స్తంభాలను వేగంగా తొలగించారు. విద్యుత్‌శాఖ అధికారులు వేగంగా స్పందించి స్తంభాలు, లైన్లకు మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. గాలులకు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లను తొలగిస్తున్నారు.



తాళ్లరేవులో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



వాసాలతిప్పలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎండ్‌హెచ్‌వో దుర్గారావు

నేతలు, అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలు..

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ముమ్మిడివరం మండలంలోని సీహెచ్ గున్నేపల్లి, గాడిలంక గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు.
- ఎమ్మెల్యే పొన్నాడ తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. తుపాను కారణంగా జరిగిన నష్టం అంచనాలు వేయాలని అధికారులను ఆదేశించారు. కూలిన తాటాకిళ్లకు 48 గంటలలోగా నష్ట పరిహారం అందిచాలన్నారు. మండల పరిధిలో హోప్ ఐలాండ్ వాసులు పునరావాస కేంద్రంలో తలదాచుకున్న వారికి రూ.2500 ఇవ్వడంతో పాటు నిత్యవసరాలు పంపిణీ చేస్తామన్నారు.
- జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ రెవెన్యూ అధికారులతో కలిసి ముమ్మిడివరం మండలం చినకొత్తలంక, గాడిలంక, అన్నంపల్లి గ్రామాల్లో పర్యటించారు. మిచాంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన పంట నష్టాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఐ.పోలవరం మండలంలోని తిళ్లకుప్పలో భారీ వర్షాలకు ముంపునకు గురైన వరిచేలను జేసీ పర్యటించారు.
- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి దుర్గారావుదొర మండలంలోని ఎస్.యానం, చల్లపల్లి గ్రామ పంచాయితీ పరిధి వాసాలతిప్ప గ్రామాల్లో ఉన్న వైద్యశిబిరాలను మంగళవారం పరిశీలించారు. ప్రతీ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.
- అల్లవరం, రెల్లుగడ్డ గ్రామాల్లో భారీ వర్షాలకు నీట మునిగిన వరిపొలాలను జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఏపీ అగ్రిమిషన్ సభ్యులు జున్నూరి రామారావుతో కలిసి పరిశీలించారు.
- ఆర్డీఓ కేవశవర్ధన్‌రెడ్డి ఎస్.రామేశ్వరంలోని తుపాను పునరావాస కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఆశ్రయం పొందుతున్న నక్కపల్లి మండలానికి చెందిన మత్స్యకారులతో మాట్లాడారు.
- క్షేత పర్యటనల్లో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శివశంకరరావు, జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్, అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ బాలవేణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, కోలా బాబ్జి, రెడ్డి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్.రామేశ్వరంలోని పునరావాస కేంద్రంలో భోజనాలు చేస్తున్న మత్స్యకారులు



అల్లవరంలో నేలవాలిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు



సీహెచ్ గున్నేపల్లిలో నీటమునిగిన వరి పనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

రైతులను ఆదుకుంటాం



విలసవిల్లిలో నీట మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవవర్ధన్‌రెడ్డి



భారీ వర్షాలతో మునిగిపోయిన పంటను చూపిస్తున్న రైతులు

ఉప్పలగుప్తం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఆర్డీవో కేశవ వర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో మంగళవారం ఆయన వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబుతో కలిసి పర్యటించి వర్షానికి నీట మునిగిన వరి చేలను పరిశీలించారు. ఏ ఒక్క రైతు నష్టపోకుండా రైతులకు పంట నష్ట బీమాలను నమోదు చేయాలని మండల అధికారులకు సూచించారు. మండలంలో 5,130 ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరిగిందని, ఇప్పటికే 1,630 ఎకారాల్లో కోతలు పూర్తయ్యాయని ఏఓ కుమార్ బాబు ఆర్డీవోకు చెప్పారు. తుపాను కారణంగా 296 ఎకరాలు పడిపోగా, 195 ఎకరాలు నీట మునిగాయని వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో ఆహ్మద్ ఆలీషా, వీఏఏ కుమారి, రైతులు జి.రామకృష్ణ, బి.వెంకట దుర్గారావు, జి.గంగరాజు, ఎస్.శ్రీను, కె.సోమరాజు, జి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో మునిగిన చేలు

యానాం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలకు దరియాల తిప్ప, కనకాలపేట, దొమ్మేటిపేట, అడివిపాలెం తదితర ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. చేతికందే దశలో ఉన్న వరి పంట మునిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల వరి పంట నేల కొరిగిపోయిందని, కోత కోసినా పంట పనికి రాదని విలపిస్తున్నారు. తుపాను వల్ల దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని అధికారులను కోరుతున్నారు. నియోజకవర్గ పరిధిలో మిచాంగ్ తుఫాను కారణంగా జరిగిన నష్టాన్ని నమోదుచేసి నివేదికను పుదుచ్చేరి ప్రభుత్వానికి పంపడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ, పీడబ్ల్యూడీ, పర్యాటక శాఖల పరంగా జరిగిన నష్టాన్ని లెక్కించాల్సి ఉందన్నారు.

ప్రమాద బాధితుడికి సాయం

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.16 వేల ఆర్థిక సాయం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం గ్రామానికి చెందిన జక్కంశెట్టి జితేంద్ర వారం రోజుల క్రితం తణుకు హైవే మీద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతడి వైద్యానికి ఇప్పటికే రూ.లక్ష వరకూ ఖర్చు చేశారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో సహాయం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరగా మంగళవారం బాధితుడి అన్నయ్య శ్రావణ్‌కుమార్‌కి రూ.16 వేల నగదు సాయంగా సంస్థ సభ్యులు అందజేశారు.



రూ.16 వేలు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

పాక కూలి లేగ దూడ మృతి

మలికిపురం: తుపాను కారణంగా వీచిన గాలులకు మండటంలోని గుడిమెళ్లంకలో జిల్లెళ్ల రమణకు చెందిన పశువుల పాక కూలిపోయింది. అందులో ఉన్న గేదె దూడ మృతి చెందింది. తహసీల్దార్ జీవీఎల్ నరసింహారావు, ఏఈ రాకేశ్ తదితరులు మండలంలో పర్యటించారు. 48 ఎకరాల్లో పంట నష్టం సంభవించినట్లు నరసింహారావు తెలిపారు.

శబరిమల యాత్రకు రెండు ప్రత్యేక బస్సులు

రావులపాలెం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సులను శబరిమల యాత్రకు పంపినట్టు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ మంగళవారం తెలిపారు. మండపేట స్వాములు ఒక బస్సు, జొన్నాడ స్వాములు ఒక బస్సులో శబరిమలయాత్రకు బయలుదేరారన్నారు. ఏడు రోజుల యాత్ర కాణిపాకం, శ్రీపురం, పళని, త్రివేండ్రమ్, పంబ, శబరిమల, తిరుపతి, విజయవాడ దర్శనం అనంతరం రావులపాలెం చేరుతుందన్నారు. అలాగే మొత్తం రావులపాలెం డిపో నుంచి ఈ సీజన్‌లో 10 బస్సులు శబరిమల వెళ్లటకు సిద్ధం చేసినట్టు డీఎం తెలిపారు.



రావులపాలెం డిపో నుంచి శబరిమల యాత్రకు బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సు

అతలాకుతలం చేసిన భారీ వర్షాలు

- కాట్రేనికోన మండలం కొప్పిగుంటలో సుడిగాలులు తిప్పేయడంతో సుమారు 80 కొబ్బరి చెట్లతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.
- కాట్రేనికోన మండలంలోని తీర గ్రామాలు మగసానితిప్ప, బలుసుతిప్ప, పల్లం, చిర్రయానం, పోర, కొత్తపాలెం, మొల్లేటి మొగ తదితర గ్రామాలు వర్షపు నీటితో పాటు సముద్రపు పోటులు పెరగడం ముంపు నీటిలో ఉన్నాయి. పల్లంకుర్రు, కందికుప్ప, దొంతికుప్ప, కొప్పిగుంట, కాట్రేనికోన తదితర గ్రామాల్లో వరి చేలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.
- ఈదురు గాలులతో కూడిన వర్షం రైతాంగాన్ని అతలాకుతలం చేసింది. చేతికొచ్చిన పంట నీట పాలైందని అన్నదాతలు విలపించారు. వందలాది ఎకరాల వరి చేలు నేలకొరిగాయి. కోత కోసిన వరి పనలు నీట మునిగాయి.
- భారీ వర్షాల కారణంగా ఉప్పలగుప్తం, అల్లవరం, కాట్రేనికోన మండలాల్లోని తీరప్రాంత గ్రామాల్లో వరి చేలల్లో మోకాలు లోతు నీరు చేరిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవొచ్చు.
- రైతులు గత మూడు రోజులుగా కోసిన వరి పనలను రోడ్లు, పుంత గట్లు, ఖాళీ స్థలాలు ఎక్కడపడితే అక్కడ ఛాట్లు కట్టి కుప్పలు వేశారు. మరి కొంత మంది రైతులు మాసూలు చేసి ధాన్యాన్ని పొలం గట్లపైన, రోడ్లపైన, కళ్లాలోనూ రాసులుగా వేసి ఉంచారు. అయితే ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు అవి తడిసి ముద్దయ్యాయి.
- ముమ్మిడిరం నియోజకవర్గంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో 48 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. దాదాపు 35 శాతం వరికోతలు పూర్తయ్యాయి. తుపాను ప్రభావంతో కోత కోసి పనలపై ఉన్న 380 ఎకరాలు నీట మునిగాయి. సుమారు 800 ఎకరాలు వరిచేలు నేలకొరిగాయి.

ముంపునీరు దిగేలా చర్యలు



రంగరాజుకోడు సమీపంలో పూడికలు తీస్తున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన వరి చేలల్లో ముంపు నీరు దిగేలా చర్యలు చేపడుతున్నట్టు తహశీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి తెలిపారు. మండలంలోని గొల్లవిల్లి, సన్నవిల్లి, నంగవరం గ్రామంలో రంగరాజుకోడులో కలిసే రెవెన్యూ డ్రెయిన్ల చివరి భాగంలో మంగళవారం జేసీబీ సహాయంతో పూడికలను తొలగించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ కె.బుల్లిరాజు, అమలాపురం డిఈ బి.శ్రీను, వ్యవసాయ శాఖ ఏడీ ఎం.ఏ.షంషి, వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు, సర్పంచ్‌లు పెయ్యల రాజ్‌కుమార్, చిక్కం జంగమయ్య పాల్గొన్నారు.

నేలకొరిగిన వృక్షాన్ని తొలగించారు



గోపవరంలో చెట్టును తొలగిస్తున్న సహాయక సిబ్బంది

ఉప్పలగుప్తం: మిచాంగ్ తుపాను తీవ్రతకు సోమవారం గోపవరం గ్రామంలో చల్లపల్లి ఆర్అండ్‌బీ రహదారిపై నేలకొరిగిన మహావృక్షాన్ని మంగళవారం అధికార యంత్రాంగం తొలగించారు. సర్పంచ్ కుంచే బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాము, ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు, వీఆర్వో నాగరాజు పర్యవేక్షణలో తొలగింపు పనులు చేపట్టారు. రహదారి రాకపోకలు పునరుద్ధరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కాకినాడ వెళ్లి పింఛన్ అందజేత

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన వంగా లక్ష్మి అనారోగ్యంతో కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కాకినాడలోనే ఉంటుంది. ఆమె తల్లి మేక అమ్మాజీ సైతం కూతురు వద్దే ఉండి ఆమె బాగోగులు చూసుకుంటుంది. తల్లీకుమార్తెలిద్దరూ ప్రతీనెలా వితంతు పింఛన్ తీసుకుంటున్నారు. మంగళవారం 5వ తేదీ కావడంతో గ్రామ వలంటీర్ అంబటి ఆనందకుమార్ తుపానును సైతం లెక్కజేయకుండా కాకినాడ వెళ్లి తల్లీకూతుర్లు ఇద్దరికీ కలిపి రూ.5,500 పింఛన్ రూపంలో అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా వలంటీర్‌ను సర్పంచ్ కుంచే బుల్లియ్య, గ్రామానికి చెందిన పలువురు నాయకులు అభినందించారు.

ఈనెల 8న జాబ్‌మేళా

మామిడికుదురు: స్థానిక దీప్తి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 8న వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందని డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్), కోజెంట్ ఈ-సర్వీస్‌లో బీపీఓ, డిక్సాన్, సియోన్ ఈ-హెచ్‌డబ్ల్యూ సుమిత్, ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పిస్తారని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని చెప్పారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి కల్పిస్తారని సత్యనారాయణ తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8వ తేదీ ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.